క్లుప్తంగా

నాటు పడవలపై ప్రయాణించొద్దు



మాట్లాడుతున్న ఎంపీడీవో కిరణ్‌కుమార్

ముంచంగిపుట్టు: గిరిజన గ్రామాల్లో నాటు పడవలపై ప్రయాణాలు చేసే గిరిజనులు నిలుపుదల చేసుకోవాలని ఎంపీడీవో కిరణ్‌కుమార్ కోరారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో కురుస్తున్న వర్షాలతో మత్స్యగెడ్డలో నీరు చేరుతుందని, దీనికి తోడు ఈదురుగాలులు అధికంగా వీస్తున్నాయని, ఆ సమయంలో నాటు పడవలపై ప్రయాణం ప్రమాదమన్నారు.నాటు పడవల ప్రయాణాలు ప్రస్తుతం చేయవద్దని హెచ్చరించారు.తుపాను వల్ల పంచాయతీ సిబ్బందిని అప్రమత్తం చేయడం జరిగిందని, పంచాయితీ సిబ్బంది అంతా వారివారి పంచాయతీ కేంద్రాల్లో అందుబాటులో ఉండాలని, ఎటువంటి నష్టాలు జరిగిన వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించినట్టు ఆయన తెలిపారు.

రెండో కౌన్సెలింగ్ నిర్వహించాలి

కొయ్యూరు: ఇంటర్‌లో చేరేందుకు విద్యార్థులకు రెండో కౌన్సెలింగ్ నిర్వహించకపోవడం అన్యాయమని భారతీయ విద్యార్థి సమాఖ్య(ఎస్ఎఫ్ఐ) జిల్లా అధ్యక్షుడు కార్తీక్, జిల్లా ప్రధాన కార్యదర్శి పాంగి జీవన్ కుమార్ అన్నారు. కాకరపాడు బాలుర గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులతో వారు శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురుకుల కళాశాలల్లో రెండో కౌన్సెలింగ్‌ను నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఉన్నత విద్య కోసం గిరిజన విద్యార్థినులు దూర ప్రాంతాలకు వెళ్లి చదవలేని పరిస్థితి ఉందని, ఈ మేరకు వారికి స్థానిక గురుకుల కళాశాలల్లో సీట్లు కల్పించాలని కోరారు. కార్యక్రమం అనంతరం జరిగిన ఎస్ఎఫ్ఐ మండల శాఖ ఎన్నికల్లో కమిటీ అధ్యక్షుడిగా భూషణ్, కార్యదర్శిగా నిర్మల, ఉపాధ్యక్షుడిగా రవి, సభ్యులను ఎన్నుకున్నారు.

బకాయి రుణాలు వసూలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏజీఎం కామరాజు

రాజవొమ్మంగి: మండలంలో మహిళా పొదుపు సంఘాల వద్ద బకాయి పడ్డ రూ. 32 లక్షల స్త్రీ నిధి రుణాలను వెంటనే వసూలు చేయాలని ఏజీఎం కామరాజు వెలుగు సిబ్బందిని ఆదేశించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఆయన క్లస్టర్ కో-ఆర్డినేటర్లు (సీసీలు), వీఓఏలు (బుక్ కీపర్లు)తో శుక్రవారం సమావేశమయ్యారు. గడచిన ఆర్థిక సంవత్సరంలో రూ. 3 కోట్ల స్త్రీనిధి రుణాలను మహిళా సంఘాలకు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ మేరకు ఆయా రుణాల బకాయిలను గడువులోగా వసూలుచేసి , జమచేయాలన్నారు. స్త్రీనిధి మేనేజర్ ఎ.ప్రవీణ్‌కుమార్, ఏపీఎం ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

యువకుడు మిస్సింగ్‌పై కేసు నమోదు



కామేశ్వరరావు

ఎటపాక: మండల పరిధిలోని రామగోపాలపురం పంచాయతీ నర్సింగపేట గ్రామానికి చెందిన ఓ యువకుడు మిస్సింగ్‌పై శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గ్రామానికి చెందిన కోర్స కామేశ్వరరావు తరచూ రాత్రి అడవి జంతువుల వేటకు వెళ్లేవాడు. ఈ క్రమంలో ఈనెల 16న రాత్రి 7 గంటల సమయంలో వేటకు వెళ్లి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామ పరిసరాల్లో వెతికినా అతడి ఆచూకీ తెలియలేదు. దీంతో భార్య రమ్య శుక్రవారం ఎటపాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ జరుపుతున్నారు.

నారుమడుల్లో నీరు నిల్వ ఉంచొద్దు

మాకవరపాలెం: నారుమడుల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని ఏవో చిరంజీవి రైతులకు సూచించారు. అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలతో వ్యవసాయ భూముల్లో అధికంగా నీరు చేరింది. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం విత్తనాలు చల్లుకున్న నారుమడుల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని తెలిపారు. అలా చేయకుంటే విత్తనాలు మొలకెత్తవన్నారు. ఈ విషయంలో రైతులు తమ సూచనలు పాటించాలన్నారు.

రోలుగుంట: ఆకుమడుల్లో నీటి నిల్వలు లేకుండా సంరక్షించుకోవాలని ఏవో ఎస్.విజయలక్ష్మి రైతులకు సూచించారు.

తెరిపివ్వని వాన

- పొంగిన వాగులు
- జలదిగ్బంధంలో గిరిజన గ్రామాలు
- శివారు గ్రామాల్లో నిలిచిన రాకపోకలు
- ఇళ్లకే పరిమితమైన గిరిజనులు
- అధికారులను అప్రమత్తం చేస్తున్న అరకు ఎంపీ గుమ్మ తనూజరాణి, ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం
- గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచనలు



ముంచంగిపుట్టులో ఉధృతంగా ప్రవహిస్తున్న కర్లపోదోర్ వాగు



అప్పలరాజుపేట వద్ద పొర్లు మదుం ద్వారా దిగువకు ప్రవహిస్తున్న వరద నీరు

అనంతగిరి: గడిచిన రెండు నాలుగు రోజులుగా ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలతో మన్యం అతలాకుతలమైంది. దీంతో జనజీవనం స్తంభించింది. ఓ వైపు గెడ్డలు పొంగి ప్రవహించడంతో గ్రామస్తుల రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామాల్లో గిరిజనులు ఇళ్లకే పరిమితమైయ్యారు.. ఖరీఫ్ సీజన్ కావడంతో వరివేసేందుకు రైతన్న సిద్ధమవుతున్న తరుణంలోని ఓవైపు భారీ వర్షాలు కారణంగా పంటపొలాల్లో స్థాయికి మించి వర్షపు నీరు చేరడంతో నాట్లు వేసేందుకు రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.

ఉధృతంగా గెడ్డలు

అరకు నియోజకవర్గంలో అనంతగిరి, డుంబ్రిగుడ, అరకులోయ, పెదబయలు, హుకుంపేట, ముంచంగిపుట్టు ఆరు మండలాల్లో భారీ వర్షాలు కారణంగా రొంపల్లి, పినకోట,పెదకోట, గుమ్మకోట, జామిగుడ, గిన్నెలకోట, శిరగం, బొండం, లోతేరు, బస్కీ, బూంగపుట్టు, రంగబయలు, లక్ష్మీపురం, బూసిపుట్టు, కుమడ, తదితర పంచాయతీల్లో గిరిజనులు గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఇళ్లకే పరిమితమైయ్యారు. వర్షాలు కారణంగా రెండు రోజులు పాటుగా పాఠశాలలకు సెలవులను కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రకటించారు. అలాగే అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేశారు. అరకు ఎంపీ గుమ్మ తనూజరాణి, ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అలాగే గిరిజనులు తగు జాగ్రత్తలు పాటించాలని, గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలోని గెడ్డలు దాటొద్దని హెచ్చరించారు. అలాగే చేపలవేటకు వెళ్లి ప్రాణాలు మీదుకు తెచ్చు కోద్దని సూచించారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలో గెడ్డ, వాగులు, నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నా యి. ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

వాగులు దాటొద్దు

రాజవొమ్మంగి: గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలో గల అనేక వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. వర్షపు నీటికి సాగు భూములు చెరువులు తలపిస్తున్నాయి. పలు రహదారులపై వర్షం నీరు ప్రవహిస్తుండడంతో వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బంది పడే పరిస్థితి నెలకొంది. శుక్రవారం ప్రమాద స్థితిని గమనించిన పోలీస్ శాఖ వాగుల వద్ద పహారా ఏర్పాటు చేశారు. స్థానిక సీఐ సన్యాసి నాయుడు, ఏఎస్ఐ సత్యనారాయణ, స్పెషల్ బ్రాంచ్ హెచ్‌సీ దుర్గారావులు తమ సిబ్బందితో వాగుల వద్దకు వెళ్లి ప్రజలు వాగులు దాటకుండా అవగాహన కల్పిస్తున్నారు. ఎటువంటి పరిస్థితుల్లోనూ పొంగి ప్రవహిస్తున్న కాలువలు, వంతెనలు దాటవద్దని హెచ్చరికలు జారీ చేశారు. ఇదిలా ఉండగా మండలంలోని మడేరు ఆనకట్ట పొంగి ప్రవహిస్తోంది. లబ్బర్తి–నెల్లిమెట్ల గ్రామాల మధ్య చిన్నేరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచాయి. వట్టిగెడ్డ–ఎర్రంపాడు గ్రామాల మధ్య వట్టిగెడ్డ వాగు ప్రమాదస్థాయిలో ప్రవహిస్తోంది. దీంతో పలు గ్రామాలకు దాదాపు రెండు గంటల పాటు రాకపోకలకు అంతరాయం కలిగింది. అప్పలరాజుపేట వద్ద వట్టిగెడ్డ రిజర్వాయర్ వరద నీటికి పూర్తిగా నిండి పొర్లు మదుం ద్వారా ఎర్రనీరు వడివడిగా దిగువకు ప్రవహిస్తోంది. రాజవొమ్మంగి నుంచి అమ్మిరేఖల వెళ్లే మార్గంలో కొండకాలువలకు వరద పోటు వచ్చి దిగువకు ప్రవహిస్తున్నాయి. రాజవొమ్మంగి శివారు శ్రీరాంనగర్‌కు వెళ్లే మార్గంలో వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ వాగు దాటుతున్న ఓ గేదె వరద నీటిలో కొట్టుకొని పోయింది. రైతులు ఆ గేదెను నీటిలో నుంచి బయటకు తీసేలోగానే మృతి చెందింది.



అరకు-అనంతగిరి ఘాట్‌రోడ్డులో ప్రవహిస్తున్న వర్షపునీరు



నెల్లిమెట్ల సమీపంలో చిన్నేరు వాగును పరిశీలిస్తున్న సీఐ సన్యాసినాయుడు, సిబ్బంది



రాజవొమ్మంగిలోని పొలాల్లో చేరిన వర్షపునీరు

భూముల అప్పగింతకు గ్రామస్తుల నిరాకరణ

గంగవరం: ఏళ్ల తరబడి తమ సాగులో ఉన్న భూములను అటవీశాఖకు అప్పగింతకు తామంతా నిరాకరిస్తున్నామని గంగవరం మండలం మర్రిపాలెం, ఎండపల్లి గ్రామస్తులు తీర్మానించారు. ఆయా ప్రాంతాల్లో ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, సర్పంచ్‌లు మడకం వెంకటేశ్వర్లు, బండారు రామలక్ష్మి ఇతర పెద్దలతో పాటు గిరిజనులతో శుక్రవారం గ్రామసభలు నిర్వహించుకున్నారు. కొండుపోడుతో పాటు ఇతరత్రా పంటలు సాగు చేసుకుంటున్న భూములు రెవెన్యూ శాఖకు చెందినవి అని, వాటిని అటవీ శాఖకు అప్పగిస్తామని ఇందుకోసం జాయింట్ సర్వే నిర్వహిస్తామని అధికారులు చెబుతున్నారన్నారు. భూములు అప్పగించడానికి తామంతా వ్యతిరేకిస్తున్నామని జాయింట్ సర్వేకి సహకరించేది లేదని వారంతా తీర్మానించారు. ఈ మేరకు తీర్మానం ప్రతులను జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌కు పంపిస్తామన్నారు.

బ్యాగు పోయిందని ఫిర్యాదు

మారేడుమిల్లి : బస్సులో బ్యాగ్ పోయినట్టు తులసీపాకలు పాఠశాలకు చెందిన టీచర్ ఆదియ్య పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ రాము తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలు..చింతూర్ మండలం తులసీపాకలు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కె.ఆదియ్య అనే వ్యక్తి గురువారం ఉదయం రాజమహేంద్రవరం నుంచి భద్రాచలం వెళ్లే బస్సును రంపచోడవరంలో ఎక్కి తులసీపాకలు పాఠశాలకు బయలుదేరారు. ఈ క్రమంలో మారేడుమిల్లిలో కొద్ది నిమిషాలు బస్సు నిలిచింది. ఆ సమయంలో మారేడుమిల్లి పరిసరాలకు చెందిన ఓ వ్యక్తి బస్సు దిగుతూ అతని బ్యాగ్‌కు బదులుగా తన బ్యాగ్‌ను తీసుకువెళ్లి పోయినట్టు ఆదియ్య తెలిపారు. వెంటనే గమనించి ఆ వ్యక్తి గురించి చుట్టు పక్కల వెతికినా కనిపించలేదని, విషయాన్ని బస్సు సిబ్బంది తెలిపారన్నారు. సదరు వ్యక్తి వదిలి వెళ్లిన బ్యాగ్‌లో ఎటువంటి సమాచారం లేనట్టు గుర్తించి, దానిని పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్టు తెలిపారు. బ్యాగులో ల్యాప్‌టాప్, ఆధార్, ఓటర్, పాన్‌కార్డు, బయోమెట్రిక్ మిషన్, ఏటీఎం కార్డు, పాఠశాల అకౌంట్ పుస్తకాలు తదితర విలువైన వస్తువులు ఉన్నట్టు టీచర్ ఆదియ్య ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్టు ఎస్ఐ రాము తెలిపారు.దీనిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు. బ్యాగ్ గురించి సమాచారం తెలిస్తే 7382405004 నంబర్‌కు సమాచారం అందజేయగలరని ఆదియ్య కోరారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

కొయ్యూరు: మండలంలోని మూలపేట పంచాయతీ జాజులబంద గ్రామాన్ని సీడీపీవో విజయకుమారి శుక్రవారం సందర్శించారు. జోరు వర్షంలో కొండసంత గ్రామం నుంచి ఆమె కాలినడకన (ఒకవైపు) సుమారు 8 కిలోమీటర్లు దూరంలో ఉన్న జాజులబంద గ్రామానికి చేరుకున్నారు. కొండ ఎక్కి గ్రామంలోని మినీ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు.అనంతరం గ్రామస్తులకు ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పించారు. చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పౌష్టికాహారంతోనే ఆరోగ్యం కలుగుతుందని, ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. శివారులో ఉన్న తమ గ్రామానికి మండల స్థాయి అధికారి రావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



జాజులబంద గ్రామంలో పిల్లలు, గర్భిణులతో మాట్లాడుతున్న సీడీపీవో విజయకుమారి

ఇటీవల సీడీపీవో విజయకుమారి మండల కేంద్రంలోని సుదూరంలో ఉన్న పెదలంక కొత్తూరు గ్రామాన్ని కొండలు, గుట్టలు ఎక్కి, వాగులు దాటి వెళ్లిన విషయం తెలిసింది. ఆమె వెంట సూపర్‌వైజర్ సునిత, సీనియర్ సహాయకులు ప్రవీణ్, కార్యకర్త విజయ, ఎంఎస్‌కె నాగమణి తదితరులున్నారు.

గొడౌన్లు నిర్మించాలి

అరకులోయ రూరల్: మండల కేంద్రం అరకులోయలో రైతులకు పంపిణీ చేయాల్సిన విత్తనాల భద్ర పరిచేందుకు వ్యవసాయ శాఖ ప్రత్యేక గొడౌన్లు నిర్మించాలని గిరిజన సంఘం నాయకులు రామరావు, బుజ్జిబాబులు తెలిపారు. స్థానిక రైతు భరోసా కేంద్రాన్ని వారు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన రైతులకు అందించేందుకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న వివిధ రకాల విత్తనాలను భద్రపరచుకునేందుకు సుమారు 100 క్వింటాళ్ల కెపాసిటీ గల గొడౌన్లు నిర్మించాలన్నారు. అన్ని రకాల విత్తనాలు భద్రతగా ఈ గొడౌన్‌లో పాడవకుండా ఉండే విదంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు, రైతులకు విత్తనాలు, ఎరువులు సక్రమంగా అందడం లేదన్నారు. దీంతో బయట మార్కెట్‌లో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి రైతులు మోసపోతున్నరన్నారు. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెటిన క్యూ ఆర్‌కోడ్ విధానంతో రైతులు అవసరమైన విత్తనాలు, వ్యవసాయ పరికరాలను కొనుగోలు చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నరన్నారు. పంచాయతీ కేంద్రలో మధ్యంతరంలో నిలిచిపోయిన రైతు భరోసా కేంద్రాలు సత్వరమే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకురావాలన్నారు. సత్యారావు, కృష్ణ, బుజ్జిబాబు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకుడు రామరావు తదితరులు

థాయ్‌లాండ్‌కు ఐఆర్‌సీటీసీ టూర్ ప్యాకేజీలు

తాటిచెట్లపాలెం: ఉత్తరాంధ్ర జిల్లాల వారి కోసం విశాఖ నుంచి పలు అంతర్జాతీయ, జాతీయ విమాన ప్యాకేజీలను మొట్టమొదటిసారిగా ప్రారంభిస్తున్నట్లు ఐఆర్‌సీటీసీ జాయింట్ జనరల్ మేనేజర్ డాక్టర్ క్రాంతి సావర్కర్ తెలిపారు.

టూర్‌ల వివరాలు..

మేజికల్ థాయ్‌లాండ్

ఈ టూర్ మొత్తం ఐదు రాత్రులు, ఆరు పగళ్లు. సెప్టెంబరు 7వ తేదీన విశాఖలో మొదలై 12వ తేదీతో ముగుస్తుంది. ఇది విశాఖ నుంచి ప్రత్యేకంగా పరిచయం చేస్తున్న మొదటి అంతర్జాతీయ టూర్. ఈ ప్యాకేజీలో పట్టాయలో గల నాంగ్‌నూచ్ గార్డెన్, అల్కజర్ షో, కోరల్ ఐలాండ్, సఫారీ వరల్డ్ టూర్, రాత్రి భోజనంతో కూడిన రివర్ క్రూయిజ్, బ్యాంకాక్‌లో గల గోల్డెన్ బుద్ధ, మార్బుల్ బుద్ధ, శ్రీ రాచ టైగర్ జూ వంటి పర్యాటక ప్రాంతాలను సందర్శించవచ్చు. మొత్తం భోజనాలు, టిఫిన్స్, వసతి (4స్టార్ హోటల్), ఏసీ సైట్ సీయింగ్, ఇన్సూరెన్స్, అన్నింటితో కలిపి ఒకొక్కరికి 57,815/-(డబుల్, ట్రిపుల్ ఆక్యుపెన్సీ), రూ.66,735 (సింగిల్ ఆక్యుపెన్సీ)

సదరన్ డివైన్ టెంపుల్ టూర్

ఈ యాత్ర మొత్తం ఐదు రాత్రులు, ఆరు పగళ్లు ఉంటుంది. ఈ టూర్ ఆగస్టు 14వ తేదీన విశాఖలో ప్రారంభమై 19వ తేదీతో ముగుస్తుంది. ఈ టూర్‌లో దక్షిణాదిలో ప్రముఖ పుణ్యక్షేత్రాలైన మధురైలోని మీనాక్షి అమ్మన్ ఆలయం, రామేశ్వరంలోని రామనాథస్వామి ఆలయం, ధనుష్కోడి, కన్యాకుమారిలోని వివేకానంద రాక్ మెమోరియల్, త్రివేండ్రంలోని శ్రీపద్మనాభస్వామి ఆలయం వంటి దర్శనీయ స్థలాలను సందర్శించవచ్చు. ఈ టూర్‌లో ఒక్కొక్కరికి విమాన టికెట్లు, లోకల్ సైట్‌సీయింగ్, భోజనం, ఏసీ హోటల్ వసతి, ట్రావెల్ ఇన్సూరెన్స్, అన్ని కలిపి రూ. 38,005 (ట్రిపుల్, డబుల్ ఆక్యుపెన్సీ), రూ.39,880 (డబుల్ ఆక్యుపెన్సీ), రూ.51,400 (సింగిల్ ఆక్యుపెన్సీ)గా చార్జీలను నిర్ణయించారు. మరిన్ని వివరాలకు విశాఖ రైల్వేస్టేషన్‌లోని ఒకటో నంబర్ ప్రవేశద్వారం వద్ద గల ఐఆర్‌సీటీసీ కార్యాలయంలో స్వయంగా గానీ లేదా చందన్‌కుమార్-92810 30748, సాయిప్రసాద్- 92814 95847, కేవీ రావు-95501 66168 నంబర్లలో సంప్రదించాలని ఐఆర్‌సీటీసీ ప్రతినిధులు కోరారు.

ప్రభుత్వ ఐటీఐలో జాబ్ మేళా

పాయకరావుపేట : పట్టణంలో గల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించడం జరిగిందని ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ తెలిపారు. అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేట్ ఐటిఐ లకు చెందిన నిరుద్యోగులు హాజరైనట్లు తెలిపారు. 156 మంది అభ్యర్థులు జాబ్ మేళాకు హాజరైనట్లు తెలిపారు. 12 కంపెనీలకు చెందిన ప్రతినిధులు అభ్యర్థులను ఇంటర్వ్యూలు నిర్వహించి 116 మందిని ఎంపిక చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ సత్యనారాయణ తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఐటీఐ ట్రైనింగ్ అధికారి, యు.ఎస్.ఎన్. మూర్తి పాల్గొన్నారు.

పాస్టర్ల నూతన కమిటీ ఎన్నిక



పాస్టర్ల నూతన కమిటీ

రంపచోడవరం: జిల్లా పాస్టర్ల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రంపచోడవరం మండలం పాస్టర్ల నూతన కార్యవర్గం ఎంపిక జరిగింది. జిల్లా సెక్రటరీ బిషప్ డాక్టర్ చంద్ర పాల్ ఇర్లపాటి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడిగా బిషప్ డాక్టర్ సియోను, కార్యదర్శిగా పాస్టర్ మనోజ్, కోశాధికారిగా పాస్టర్ ఆశీర్వాదంను ఎన్నుకున్నారు. గాస్పల్ ప్రెసిడెంట్‌గా పాస్టర్ జాసన్స్, సువార్తుడు విండెల వెంకన్నబాబును దైవ సమావేశంలో ఎన్నుకున్నట్టు జిల్లా కార్యదర్శి ప్రకటించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ క్రైస్తవ హక్కుల కోసం పనిచేస్తామన్నారు.

పశువ్యాధులపై అప్రమత్తం



పెదబరడలో పశు వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న లంబసింగి పశువైద్యాధికారి డాక్టర్ షాలిని

చింతపల్లిరూరల్: పశు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని లంబసింగి పశువైద్యాధికారి డాక్టర్ చల్లంగి షాలీని అన్నారు. మండలంలో పెదబరడ పంచాయతీ కేంద్రంలో గిరిజనులకు పశువుల్లో కలిగే వ్యాధులు , నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణ మార్పుల కారణంగా పశువుల్లో పలు రోగాలు వ్యాప్తి చేందుతాయన్నారు. పశువుల్లో ఎటువంటివైనా రోగా లక్షణాలుంటే తక్షణమే పశు వైద్యులకు సమాచారం అందించాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది గాని సమస్య పరిష్కారించేందుకు అవకాశం ఉంటుందన్నారు. గిరిజనులకు పశువులకు సోకే వ్యాధులపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. పంట పొలంలో క్రిమిసంహారక మందుల పిచికారీ చేసిన గడ్డిని పశువులు తీనడం వలన పశువులు మరణించే అవకాశం ఉందన్నారు. మందులు పిచికారీ పంటల వైపు పశువులను మేతకు తీసుకెళ్లొద్దన్నారు. సిబ్బంది అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదవాలి



విద్యార్థులను అభినందిస్తున్న ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్, ప్రిన్సిపాల్ మోహన్

కొయ్యూరు: గురుకుల పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఎన్నికలు నిర్వహించారు. ఇందులో విద్యార్థులు పాల్గొని వారి ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్, ప్రిన్సిపాల్ టీవీఎం మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా వారు ఎన్నికైన విద్యార్థులతో ప్రమాణ స్వీకారం చేయించారు.వారి విధులను వివరించారు. ప్రతీ ఒక్కరు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం ఐదో తరగతిలో చేరిన విద్యార్థుల తల్లిదండ్రులతో ఆహ్వాన వేడుకను నిర్వహించారు. తల్లిదండ్రులు పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ కె.శివాజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలకు ప్రోత్సాహం

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం: ఏజెన్సీలో ఉద్యాన పంటలు పండించే గిరిజన రైతులను అభివృద్ధి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక హెచ్ఎన్‌టీసీలో గిరిజన రైతులకు జీడిమామిడి, జాఫ్రా మొక్కల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఏజెన్సీ ఏడు మండలాల్లో గిరిజన రైతులకు జీడిమామిడి, మామిడి, దబ్బ, బత్తాయి, నిమ్మ , కొబ్బరి,మునగ, డ్రాగన్ ఫ్రూట్, చింత తదితర మొక్కలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకం అనుసంధానం ద్వారా 2500 ఎకరాల్లో మొక్కలు నాటుకునేందుకు పంపిణీ చేస్తున్నామని చెప్పారు.ఉపాధి హామీ పథకంలో మొక్కలు సంరక్షణ, ఎరువులు, నీరు పోసేందుకు కూలి డబ్బులు చెల్లిస్తామని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లోని ప్రభుత్వ నర్సరీల నుంచి ఐటీడీఏ నర్సరీ నుంచి మొక్కలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ కొమ్మిశెట్టి బాలకృష్ణ, సర్పంచ్ మంగా బొజ్జయ్య, ఉపాధి హామీ ఏపీవో సత్యనారాయణ, టీఏ వీరన్న సిబ్బంది పాల్గొన్నారు.



రైతులకు మొక్కలు పంపిణీ చేస్తున్న పీవో సూరజ్‌గనోరే

వేములకొండ పంచాయతీలో..

మండలంలో వేములకొండ పంచాయతీ పరిధిలోని దబ్బవలస, సోకులగూడెం, ధారగూడెం, అనెంపల్లి గ్రామాల్లో రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా 28 మంది రైతులకు సర్పంచ్ కొమరం పండుదొర పంపిణీ చేశారు. ఎంపీటీసీ నర్రి పాపారాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- కాకరపాడు,కొయ్యూరు వంతెనలపై నిలిచిపోతున్న వర్షపు నీరు
- వాహనచోదకుల రాకపోకలకు ఇబ్బందులు

కొయ్యూరు: కాకరపాడు, కొయ్యూరు వంతెనలకు రెండు వైపులా వివిధ టెలికాం కంపెనీలకు చెందిన వారు పైపుల ఏర్పాటుతో వంతెన శ్లాబ్‌లపై నీరు ఉండిపోతుంది. ఈ కారణంగా వంతెనలకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని వాహనచోదకులు భయపడుతున్నారు. గతంలో వంతెనల ఇరువైపులా అంచులు ఖాళీగా ఉండేవి. దీంతో వర్షపు నీరు కాలువలోకి వెళ్లేది. ఇప్పుడు మొబైల్ టవర్ల ఏర్పాటుకు వీలుగా కేబుల్ పైపులు ఏర్పాటుచేశారు. తరువాత సిమెంట్‌తో కాంక్రీట్ చేశారు. దీని మూలంగా వంతెన రెండు వైపుల ఎత్తు పెరిగిపోయింది. వర్షపునీరు బయటకు వెళ్లే మార్గం లేక వంతెనపై ఉండిపోతుంది. దీంతో వంతెన పాడయ్యే అవకాశముందని, వర్షపునీరు నిల్వ మట్టం పెరుగుతుండడంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నామని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. వంతెనలు నిర్మించి 60 సంవత్సరాలు కావస్తోందని, ఈ క్రమంలో ప్రమాదాలు జరిగే అవకాశముందని చెబుతున్నారు. దీనిపై సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.



కొయ్యూరు వంతెనపై నిలిచిపోయిన వర్షపునీరు

చర్యలు తీసుకుంటాం

వంతెనలపై నీరు నిల్వ లేకుండా పోయేందుకు వీలుగా చర్యలు తీసుకుంటాం. వంతెనలకు రెండు వైపులా అమర్చిన పైపులను పరిశీలించి నీరు కిందకు వెళ్లేలా వీలుగా చూస్తాం. ఇందుకు ఉన్నతాధికారులకు సమస్యను తెలియజేసి, సూచనల మేరకు పనులు చేపడతాం.

– ప్రసాద్, జేఈ, ఆర్అండ్‌బీ